క్లుప్తంగా

గరుడ వాహనంపై శ్రీవారు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బొమ్మనహాళ్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి శనివారం గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. శ్రీనివాసుడిని అలంకరించి, పూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, సూర్యప్రభ వాహ నంపై ఊరేగింపు, మహా మంగహారతి పూజలు చేశారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు గరుడ వాహనంపై సతీసమేతంగా శ్రీవారిని కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి పల్లకీ ఉత్సవం



పెన్నహోబిలంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండల పరిధిలో ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి పల్లకీ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో పల్లకీలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహ స్వామిని ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు.

ఇస్లామిక్ సమ్మర్ క్యాంపులు

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచి ఇస్లామిక్ విద్యపై విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులకు ఇస్లామి సమ్మర్ క్యాంపుల పేరిట తరగతులు నిర్వహిస్తున్నట్లు ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు. నైతిక విలువలు పెంపు, ఖురాన్, హదీసుల చిన్నపాటి సూక్తులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం తదితర విషయాలు సమ్మర్‌క్యాంపుల్లో నేర్పించబడతాయన్నారు. మక్తబ్ ఏ దీనియాత్ ఉల్మ ఆధ్వర్యంలో మక్కా మసీదు, జామియా చౌక్ మసీదు, టిప్పు మసీదు, ఖుబ మసీదు, గౌసే ఆజం దర్గా మసీదుల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

డీఎస్సీ మెటీరియల్ వితరణ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, సన్‌రైజస్ పాఠశాల కరస్పాండెంట్ మారెన్న పూలే ఆశయ సాధన సమితి సభ్యులకు మెటీరియల్‌ను శనివారం అందించారు. నిర్వాహకులు చిరంజీవి, రంజిత్, లింగన్న, ధనుంజయ, బద్రి, సంతోష్, తిమ్మన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ తదితర అనుమానిత ప్రాంతాల్లో పట్టణ సీఐ యువరాజు పోలీసు సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో శనివారం పట్టణ సీఐ, పోలీసులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100/112 నంబర్‌కు లేదా 9490106284 నంబర్‌కుగానీ లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

విస్తృతంగా నాకాబందీ



రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నాకాబందీ నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, స్థానిక పోలీసు సిబ్బందితో పట్టణంలోని కీలక రోడ్లు, వ్యాపార సముదాయాలు, అధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతాలు, రైల్వేస్టేషన్, బస్టాండ్, బస్సుల్లో తనిఖీలు చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలుగాని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే 100 లేదా 112 గాని స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

29న అక్క దేవతల జాతర

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో ఈ నెల 29న అక్కమ్మ దేవతల జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. 30న సాయంత్రం పన్నేరపు బండ్లు ఆలయం చుట్టూ తిప్పుతారు. అనంతరం వసంతోత్సవంతో జాతర ముగుస్తుంది.

అందరి చూపు.. సోలార్ వైపు





ఉరవకొండలో మిద్దెపై ఏర్పాటు చేసుకున్న సౌరఫలకాలు, విడపనకల్లు సమీపంలో పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు

- 'సూర్యఘర్'తో పేదల ఇంట్లోనూ వెలుగులే
- తక్కువ ఖర్చుతో సౌర వెలుగులు
- సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీలు

ఉరవకొండ: ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రతి ఇంటా ఫ్యాన్, ఏసీ ఉండాల్సిందే. దీంతో కరెంటు బిల్లు కూడా పెరిగిపోతోంది. దీనికితోడు కూటమి ప్రభుత్వం కరెంటు బిల్లుల మోత మోగిస్తోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూర్యఘర్' వైపు మొగ్గుచూపుతున్నారు. సౌర విద్యుత్‌కోసం రాయితీలు కూడా కల్పిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలూ సోలార్ వెలుగులపై ఆసక్తి చూపుతున్నారు.

సబ్సిడీతోపాటు రుణ సదుపాయం:

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించడానికి సూర్యఘర్ పథకం ప్రవేశపెట్టింది. సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకొని వాడకంపై పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈపథకం కింద 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం ఉండాలనే నిబంధన ఉంది. సూర్యఘర్‌కు ట్రాన్స్‌కో అధికారుల అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వ్యాట్‌కు నిర్ణయించిన ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. చివరిగా ఇంటి పైభాగంపై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ల స్థానంలో నెట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. నెట్‌మీటర్ బిగించిన తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తోంది. ఒక కిలో వ్యాట్ రూఫ్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు 1 గీ6 మీటర్ల ఎత్తు) అమర్చుతారు. కిలో వ్యాట్ సోలార్ రూటార్ ప్యానల్ నెలకు దాదాపు 125 పై యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది.

దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా:

ఈపథకం కింద ప్రయోజనం పొందాలంటే తొలిత సూర్య ఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంట్ బిల్లుల కాపీలు జతచేయాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకొనే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రుణసదుపాయం కల్పిస్తోంది. 6, 7 ఏళ్లలో పెట్టుబడి తిరిగి పొందొచ్చు. నెట్ మీటరు విధానం మూలంగా విద్యుత్ వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలుంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– గురుమూర్తి, ఏఈ, విద్యుత్ శాఖ, ఉరవకొండ

పీఎం సూర్యఘర్ పథకం వివరాలు

వినియోగం	సోలార్ కెపాసిటీ (యూనిట్లలో)	సబ్సిడీ (కిలో వ్యాట్‌లలో)
0-150	1-2	రూ.30 నుంచి రూ.60 వేలు
150-300	2-3	రూ.50 నుంచి రూ.78 వేలు
300 పైన	3	రూ.78 వేలు

'సూర్యఘర్' కింద సబ్సిడీ కోసం వివిధ బ్యాంకుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు

మండలం	మొత్తం వచ్చిన దరఖాస్తులు	మంజూరు చేసినవి
ఉరవకొండ	210	80
విడపనకల్లు	50	8
కూడేరు	29	2
బెళుగుప్ప	11	5
వజ్రకరూరు	41	15
	341	110

అడుగడుగునా కూటమి నాయకుల కుట్రలు

రాయదుర్గం/బొమ్మనహాళ్: కూటమి నాయకులు కొందరు అడుగడుగునా తనను, తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని బొమ్మనహాళ్ మండలం బండూరు సర్పంచ్ రాధిక భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉద్దేహాళ్ రాజ్‌కుమార్ వాపోయారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తన కుటుంబాన్నే లక్ష్యం చేస్తూ అధికారులతో అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టిందిలేదని, అధికారులు ఎప్పుడో చేసిన తప్పిదాన్ని తనపై నెట్టి దోషిని చేసేలా కుట్ర చేస్తున్నారని వాపోయారు. ప్రతినెలా తన బిల్డింగ్‌కు ఇచ్చే విద్యుత్ బిల్లును క్రమం తప్పకుండా చెల్లించానన్నారు. ఉన్నపళంగా ఈ నెల 24న తన ఇంటి వద్దకు వచ్చిన విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మిరెడ్డి రూ.5 లక్షల విద్యుత్ బకాయి చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యామన్నారు. దీనిపై ప్రశ్నిస్తే మీటర్ ఏర్పాటు చేసే సారి 1.0 పీడింగ్ చేయాల్సింది పోయి 0.5 గా నమోదు చేయడంతో తప్పిదం జరిగిందని, దీన్ని సరిచేసేలా చూస్తామని ఏఈ హామీ ఇచ్చివెళ్లారన్నారు. గురువారం ఉదయం రాయదుర్గం ఏడీ శ్రీనివాసులు సిబ్బందితో వచ్చి బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తామంటూ హెచ్చరించారన్నారు. ఎందుకు నన్ను ఇలా టార్గెట్ చేస్తున్నారని అడిగినా సరైన సమాధానం చెప్పకుండా గంటల వ్యవధిలోనే ఇంటికి సరఫరా నిలిపేశారని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల్లోగా రూ.5 లక్షలు బిల్లులు చెల్లించినా 11:50 వరకు పునరుద్ధరించలేక కాలయాపన చేశారని మండిపడ్డారు. ఇప్పటికే తనపై సుమారు ఐదు అక్రమ కేసులు నమోదు చేయించినట్టు తెలుస్తోందన్నారు. ఏదో ఓ కేసులు ఇరికించుకుని జైలు పాలు చేయాలన్న తపన పచ్చముకలకు ఎక్కువైనట్టు కనిపిస్తోందన్నారు. తొలుత భూములు, బోర్లు, అక్రమ కేసులతో ఇబ్బందులు పెట్టిన నేతలు తాజాగా ఎప్పుడో నిర్మించిన తన భవనం ముందున్న రేకులు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయంటూ వాటిని తొలగించేలా సర్వేలు, రెడ్ మార్కులు వేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా దానిపై కూడా నోటీసులు ఇచ్చారన్నారు. తనకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, పార్టీ నాయకులు నిలిస్తే సుమారు 50 మందికి పైగా కేసులు నమోదుచేసి నోటీసులు ఇచ్చే పరిస్థితికి వచ్చారన్నారు. వేధింపులు ఆపకపోతే న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ న్యాయం చేయాలని కోరారు.

బోర్డు ఏర్పాటులో వివక్ష సరికాదు



అప్పటి స్థానంలోనే బోర్డు ఏర్పాటు చేసిన దళిత సంఘం నాయకులు

రాయదుర్గం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసే బోర్డులోను కొందరు రాజకీయం చూపడం సరికాదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్ అన్నారు. శనివారం మండలంలోని రాయంపల్లి లోఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలమప్ప, జిల్లా జేఏసీ నాయకులు దొనతిమ్మప్పతో కలసి గ్రామంలో పర్యటించారు. స్థానిక దళితులు కిష్టప్ప, తిప్పేరుద్ర, రమేష్, వన్నూర్‌స్వామి, వెంకటేశులుతో కలసి మాట్లాడారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా గాలికి కిందకు పడిపోయిన బోర్డు స్థానంలో కొత్తగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇంతలోనే ఆ పక్కనే నివాసం ఉండే ఓ వ్యక్తి బోర్డు ఏర్పాటుకు ఆటంకం కలిగించాడు.దీనిపై దళితులు అర్బన్ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో తమను నేటికీ అంటరానితనంగా చూస్తున్నారని ఆలయాలు, రచ్చబండ్ల వద్దకు రానీయడం లేదని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సిబ్బందితో కలసి తహసీల్దార్ గ్రామానికి వచ్చి దళితులను చులకనగా చూస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



రాయదుర్గంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. మసీదుల్లో మగ్‌రీబ్ నమాజ్ అనంతరం ముస్లింలు స్థానిక వినాయక సర్కిల్‌లో భారీ ఎత్తున చేరుకుని కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. పాతబస్టాండ్, అనంతపురం ప్రధాన రహదారి మీదుగా లక్ష్మీబజార్ వరకు ప్రదర్శన చేశారు. ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, ఇతర మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం మతంలో హింసకు ఏమాత్రం తావులేదన్నారు. తీవ్రవాదం, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే వారికి ఖురాన్‌లో ఎక్కడా చోటు లేదన్నారు. ముస్లిం ప్రముఖులు సనావుల్లా, ఇస్మాయిల్, బ్రెడ్ సర్మాస్, అయూబ్‌ఖాన్, చమ్మా అస్లాం, మాజిద్, మౌలానాలు, మత గురువులు పాల్గొన్నారు.

పద్మశాలీయ బహూత్తమ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలో పద్మశాలీయ బహూత్తమ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. స్థానిక మార్కండేయస్వామి ఆలయం వద్ద నుంచి పద్మశాలీయ సంక్షేమ సేవా సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవా శివప్ప, ధర్మకర్త పలువురి ముకుంద, ఉపాధ్యక్షుడు సోమ పాండు, ప్రచార కార్యదర్శి గురు రాఘవేంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జింకా వసుంధర, రాష్ట్ర పద్మశాలి సంఘం డైరక్టర్ పొరాళ్ల పురుషోత్తం, పొరాళ్ల శివకుమార్, చుంచుల నాగప్ప, ధనార్జున పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే సేవా అవార్డుల ప్రదానం



బీఆర్ అంబేడ్కర్, పూలే సేవా అవార్డులు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే సేవా అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరిగింది. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన్‌నాయుడు, విడపనకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధర్ హాజరయ్యారు. అనంతరం అవార్డులకు ఎంపికైన ఉరవకొండ మహాత్మ డిగ్రీ కళాశాల అధినేత షాషావలి, గుంతకల్లుకు చెందిన పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, కొకుంట్లకు చెందిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చాకరి రవి, విడపనకల్లు శుభోదయం స్కూల్ ఆనంద్‌కుమార్, వజ్రకరూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్‌రెడ్డి, ఉరవకొండ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కిష్టప్పకు అవార్డులు అందించారు.

యశ్వంత్‌పుర-విజయపుర మధ్య ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: యశ్వంత్‌పుర నుంచి విజయపురకు రాయదుర్గం మీదుగా ఈ నెల 30న, మే 1న రానూపోనూ ఒక ట్రిప్‌గా ప్రత్యేక సమ్మర్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో స్పెషల్ రైలు షెడ్యూల్‌ను విడుదల చేశారు. 30న యశ్వంత్‌పుర-విజయపుర (రైలు నంబర్ 06561) ప్రత్యేక రైలు యశ్వంత్‌పురలో రాత్రి 10 గంటలకు బయల్దేరి తుమకూరు, అర్సికెర, బీరూర్, చిక్‌జాజూర్, చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట్, గదగ్, బాగల్‌కోటి, అల్మట్టి మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు విజయపురకు చేరుతుందన్నారు. ఇదే రూట్‌లో తిరుగు ప్రయాణంలో విజయపుర-యశ్వంతపుర (రైలు నంబర్ 06562) మే 1న రాత్రి 7 గంటలకు విజయపురలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 11.14 గంటలకు యశ్వంత్‌పురకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు షెడ్యూల్‌ను గుర్తించి ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోగాల బారిన పడుతున్నా పట్టించుకోరా?



తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని నిలదీస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు



రేషన్ బియ్యం, పింఛన్లపై తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచ్ యోగేంద్రరెడ్డి

ఉరవకొండ రూరల్: పట్టణంతో పాటు గ్రామాల్లో కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు రంగు మారి వస్తోందని, దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నా పట్టించుకోరా? అని ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్‌తో పాటు సభ్యులు అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా పహల్గాంలో ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలియజేశారు. అనంతరం తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు నిలదీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఐజయ్యను ఎంపీపీ, వైస్ ఎంపీపీలు తాగునీటి సరఫరాపై నిలదీశారు. ఉరవకొండ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ వెలిగొండకు వేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయన్నారు.అప్పటి నుంచి పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. నెరిమెట్లలో విద్యుత్ సరఫరాలేదని, విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదని సర్పంచ్ ఎంపీడీఓ రవిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజా పంపిణీ అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోరా?

మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పేదలకు రేషన్ బియ్యం వేయకుండా డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారని నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి తహసీల్దార్ మహబూబ్‌బాషాను నిలదీశారు. నెరిమెట్లలోని 23, 56 రేషన్ షాపుల్లో 80 శాతం రేషన్ బియ్యం పంపిణీ కాలేదన్నారు. ఎండీయూ వాహన ఆపరేటర్‌లు 13 మందిని ఎందుకు పక్కనపెట్టారని నిలదీశారు.

సంక్షిప్త సమాచారం

పేకాట,మద్యం కేసుల్లో పలువురి అరెస్టు

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎర్రకొండాపురం, మామడూరు పరిధిలోని పేకాట స్థావరాలపై ఎస్ఐ నరేంద్ర కుమార్ సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. ఎర్రకొండాపురం వద్ద నలుగురిని అదుపులోకి తీసుకొని, వారినుంచి రూ.6,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. మామడూరులో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో ఆంధ్ర మద్యం అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి,వారి నుంచి 30 ఆంధ్ర మద్యం బాటిళ్లు సీజ్ చేశారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

కుందుర్పి: ఆర్డీటీ సేవలను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని న్యాయవాది నరసింహమూర్తి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఎలక్ట్రీషియన్ నాగేంద్ర, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, జంబుగుంపల సర్పంచ్ గంగాధర తదితరులు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐదు దశాబ్దాలకు పైగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. ఆర్‌డీటీ సేవలకు కేంద్ర ప్రభుత్వం అంతరాయం కలిగించడం సరికాదన్నారు. ఆర్డీటీ సేవా కార్యక్రమాలు ఆగిపోతే పేదలు బతికే పరిస్థితిలేదన్నారు. ప్రభుత్వం సత్వరం సంస్థను రెన్యూవల్ చేయించి సేవా కార్యక్రమాలు అందేలా చూడాలని వారు కోరారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రాయదుర్గంటౌన్: ఇప్పటి దాకా ఈకేవైసీ చేయించుకుని రేషన్‌కార్డుదారులు మరో రెండు రోజుల్లోపు కచ్చితంగా స్టోరు డీలర్ల వద్ద కేవీసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వివిధ స్టోర్ల వద్ద ఈకేవైసీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ నమోదు కాని పక్షంలో సదరు యూనిట్లకు రేషన్ నిలిపివేయనున్నట్లు హెచ్చరించారు. రాయదుర్గం అర్బన్, మండల పరిధిలో 99,058 రేషన్ యూనిట్ల(సభ్యులు)కు గాను ఇప్పటి దాకా 88,901 యూనిట్లకు ఈకేవైసీ పూర్తయినట్లు చెప్పారు. ఇంకా 8 శాతం ఈకేవైసీ పెండింగ్ ఉందని, సభ్యులు తమ ఈకేవైసీని స్టోరు డీలర్ల వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు.

30లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

కూడేరు: రేషన్ కార్డుదారులు ఈనెల 30లోపు ఈకేవైసీ చేయించుకోవాలని, లేదంటే బియ్యం కోటా రద్దు అవుతుందని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12,870 మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారన్నారు. అందులో మొత్తం 37,199 మంది ఉండగా ఇప్పటి వరకు 33,513 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా 2869 మంది చేయించుకోని వారు ఉన్నట్లు ఆమె తెలిపారు.

రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి

కూడేరు: అకాల వర్షానికి దెబ్బతిన్న పండ్లతోటల రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను అంచనా వేయించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. రైతుల పట్ల చిన్న చూపు చూస్తోందన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన అరటి, బ్యాడిగి మిర్చి దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోనే దాదాపు రూ. కోటి వరకు పంట నష్టం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కనీసం పంట నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ముందుకు రాకపోవడం దారుణమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు జల్లిపల్లి సిద్దారెడ్డి పాల్గొన్నారు.

మంజునాథస్వామి ఆలయంలో పూజలు



మంజునాథస్వామి పంచామృతాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో శనివారం మాసశివరాత్రి పూజలు, అభిషేకాలు చేశారు. ఇటీవల ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా నూతన మంటపంపై శివపార్వతుల విగ్రహాల ఏర్పాటు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహాల ప్రతిష్ఠ, లలితా సహస్ర నామ, శివపురాణ పారాయణాలను చేశారు. ఆదివారం నుంచి మాస శివరాత్రి పూజలు, అనంతరం అన్నదానం చేసినట్లు సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

కళ్యాణదుర్గం రూరల్: ఏపీ పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ హాల్ టికెట్లను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 30న ఉంటుందని, హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. డౌన్‌లోడ్ కాని విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించి రూ.400 ఫీజు, రెండు ఫొటోలతో పాలిసెట్ అప్లికేషన్‌తో సంప్రదించాలని సూచించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ మీట్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 28న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుందని చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని లిటిల్ రోజెస్ పాఠశాలలో లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నియోజవర్గం వ్యాప్తంగా 50 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 21 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి కంబాల తిమ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు



అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చాలా మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు.